## భూముల ఇచ్చే వారికి రిటర్నబుల్ ప్లాట్లు



3 లో

మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
మంగళవారం | 1 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 11



4 లో

# అమరావతి ఛాంపియన్షిప్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా

పి.మీరాహుస్సేన్ ఖాన్

13 స్వర్ణం, 12 రజత పతకాలు కైవసం

పతక విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష

-విజయవాడ, మనంబ్యూరో



5 లో

## ప్లాస్టిక్ వినియోగం మానేద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఇక కఠిన చర్యలు

ప్రజలు, వ్యాపారులు సహకరించాలి

కలెక్టర్ డీకే బాలాజి

# అర్జీల పరిష్కారంలో జిల్లాను ముందంజలో నిలపాలి



4 లో

గడువులోగా పరిష్కారంతో పాటు నాణ్యతకూ పెద్దపీట వేయాలి

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేదు

జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 161 అర్జీలు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

## ప్రజా సేవకుల స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలి



**వీరులపాడు ఆగష్టు 31, మనం న్యూస్:** వీరులపాడు మండలం పల్లంపల్లి గ్రామంలో ఆదివారం రోజున మాజీ నీటి సంఘం అధ్యక్షులు యండ్రపల్లి కృష్ణారావు గారి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేసిన యండ్రపల్లి కృష్ణారావు సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల కోసం పనిచేసిన నాయకుల సేవలను గుర్తించి, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణాభివృద్ధి, సాగునీరు, రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోంద న్నారు. నందిగామ నియోజకవర్గంలో కూడా ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కృష్ణారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన ప్రజా సేవలను స్మరించు కోవడంతో పాటు, ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసిన నాయకులకు సమాజం ఇచ్చే గౌరవానికి ఇది ప్రతీకగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రైతులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఫోర్ కార్నర్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**తాడేపల్లి, ఆగస్టు 31, మనం, న్యూస్:** రాష్ట్ర ఐటి ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఫోర్ కార్నర్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు సమక్షంలో తాడేపల్లి టిడిపి కార్యాలయంలో సోమ వారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాష్ట్ర విద్య, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఫోర్ కార్నర్ ఇండియా ట్రస్ట్ ఆధ్వ ర్యంలో, అమరావతి కంటి ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసి నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ ఉచిత కంటి వైద్య పరీక్షల్లో కంటి అద్దాల కొలతలు, షుగర్, బీపీ ఉన్న వారికి ప్రత్యేక పరీక్షలు, సీటీ స్కాన్, గ్లకోమా, శుక్లము తదితర కంటి సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 100 మంది కి పరీక్షలు నిర్వహించినట్లు వారిలో 15 మందికి ఆపరేషన్ చేయాలని 8 మందికి కళ్ళజోళ్ళు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ-హెచ్ఎస్ ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్న వారికి ఉచితంగా కంటి వైద్య సేవలు అందించ నున్నట్లు తెలిపారు. శుక్లము కంటి పొర అవసరమైన వారికి యు.టి.ఆర్. ఆరోగ్య కార్డు ద్వారా అమరావతి కంటి ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్ కర్నార్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ బుర్ర ప్రేమ్ కుమార్,అమరావతి కంటి హాస్పిటల్ బ్రాంచ్ హెడ్ పలగాని కోటి రత్నం,ఇట్టా పెంచలయ్య,బేతపూడి వాసు,గాదె తులసి దాసు,డాక్టర్ సౌమ్య, హాస్పిటల్ సిబ్బంది సమీరా,కృష్ణ చైతన్య, మోజెస్,టీడీపీ నాయకులు కంభం సాయి చంద్, తాడిబోయిన గోపి, తురక దుర్గారావు, సుధాకర్, రహీమ్, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతోవడ్డేశ్వరంలో రూ.83 లక్షలతో మోడరన్ పార్క్ ఏర్పాటు



▸▸ **భూమి పూజ చేసిన రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ**

**తాడేపల్లి, ఆగస్టు 31, మనం న్యూస్:** రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వడ్డేశ్వరంలో రూ.83 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మోడరన్ పార్కు భూమి పూజ సోమవారం ఉదయం జరిగింది. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మన్నవ మోహన్ కృష్ణమాట్లాడు తూ. మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పార్కులు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచే చర్యలు చేపడుతు న్నారని అన్నారు. వడ్డేశ్వరంలో నిర్మించనున్న మోడరన్ పార్కులో వాకింగ్ ట్రాక్లు, గ్రీనరీ, ఆధునిక వినోద, వ్యాయామ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ఈ పార్కును తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ భాష,జనసేన తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణవందన, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబెర్ శంకర్ శెట్టి పిచ్చియ్య, వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి కోటయ్య, సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్రావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు కామినేని సాంబశివరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు నాగూర్వలి, చావలి సురేష్, మస్తాన్బీ, కరీమా, కామినేని మౌనిక, సత్తెనపల్లి రాజా, వంగూరు వెంకటేశ్వరరావు, గుంపెన నాగేశ్వరావు, కాట్రగడ్డ లక్ష్మణావు, దాసు, అబ్రహం, సాకనాటి మధు, మద్దినేని సుబ్రమణ్యం, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, కాట్రగడ్డ శివన్నారాయణ, బెజ్జం బాబురావు, దాసు,తంబీ, బాబావలి, సురేష్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఒకే రోజు 16 కొత్త శాఖలను ప్రారంభించిన కరూర్ వైశ్యా బ్యాంక్



**గాంధీనగర్, ఆగస్టు 31 మనం న్యూస్:** ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన కరూర్ వైశ్యా బ్యాంక్ ఒకే రోజు దేశవ్యాప్తంగా 16 కొత్త శాఖలను ప్రారంభించి కీలక విస్తరణ మైలురాయిని సాధించింది. దీంతో బ్యాంకు మొత్తం శాఖల సంఖ్య 919కి చేరింది. కొత్త శాఖల్లో ఆరు తమిళనాడులో, ఐదు ఆంధ్రప్రదేశ్లో, మూడు తెలంగాణలో, కర్ణాటక, ఢిల్లీ-ఎన్సీఆర్లో ఒక్కో శాఖ చొప్పున ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్లో విజయవాడ-రామవరప్పాడు, జగ్గయ్యపేట, సోంపేట, విశాఖపట్నం-కంచరపాలెం, రాజమండ్రి-కొంతమూరు ప్రాంతాల్లో కొత్త శాఖలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలి శాఖను బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రమేష్ బాబు ప్రారంభించగా, ఇతర శాఖలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్గా ప్రారంభించారు. రిటైల్ వినియోగదారులు, ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ రంగానికి మరింత చేరువ కావడమే ఈ విస్తరణ లక్ష్యమని ఆయన తెలిపారు. జూన్ 30, 2026 నాటికి బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.2,27,267 కోట్లుగా నమోదైంది. 2026-27 తొలి త్రైమాసికంలో రూ.756 కోట్ల అత్యధిక నికర లాభాన్ని నమోదు చేసింది.

## గుండిమెడ దేవదాయ ధర్మాదాయ శాఖ భూములకు రక్షణ

▸▸ **గుండిమెడలో 30 కోట్ల విలువైన దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములను స్వాధీనంచేసుకున్న ఎండోమెంట్ డిపార్ట్మెంట్**



**తాడేపల్లి, ఆగస్టు 31, మనం న్యూస్:** గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన భూములకు సంబంధించిన వివరాలతో బోర్డు హెచ్చరిక ఏర్పాటు చేశారు. గుండిమెడ గ్రామంలో గల శ్రీ ధర్మదాయం స్వామికి చెందిన ఆర్ ఎస్ నెం 260/1లోని 1-71 సెంట్లు, ఆర్ ఎస్ నెం 260/2 లోని 0-98 సెంట్ల భూమికి సంబంధించి అమ్మకాలు, కొనుగోలు జరుగుతు న్నాయనిఎండోమెంట్ దృష్టికి రాగా సోమవారం దేవాదాయ ధర్మాదాయ ఎండోమెంట్ ఈవో ప్రమీలా రాణి డిపార్ట్మెంట్తో కలసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ అమరావతి ఉత్తర్వులు జారీ ప్రకారం బోర్డు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పెదకాకాని గ్రామం మండలం పరిధిలోని .ఓ.అ. నం. 13/2024 కేసులో ఉత్తర్వులు పెండింగ్లో ఉన్నట్లు, కావున సదరు భూమికి సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టరాదని బోర్డులో స్పష్టం చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ధర్మదాయ స్వామి భూములను పరిరక్షించేం దుకు అధికారులు చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సేవలతోనే నాయకత్వ పదవులు పొందాలి



**గాంధీనగర్ -ఆగస్టు 31 (మనం న్యూస్):** సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నాయకత్వ పదవుల్లో రాణించాలని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. లోటస్ మార్గ్లోని ధారాస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన జోన్ సోషల్ సమావేశానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ దేశ, విదేశాల్లో వివిధ సేవా కార్యక్రమాలతో విస్తరించిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రస్తుతం దాదాపు లక్ష మంది సభ్యులతో సుస్థిరంగా కొనసాగుతోందన్నారు. అదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తూ నాయకత్వంలో ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ముఖ్య అతిథి అంతర్జాతీయ సహాయ కార్యదర్శి కొనకళ్ల సత్యకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వాసవి కుటుంబ సంరక్షణ పథకం, రక్షణ కవచం ద్వారా తక్షణ సాయం, వ్యాపారస్తులకు వడ్డీ లేని స్వల్ప రుణాలు తదితర అనేక సేవా పథకాలను సంస్థ అమలు చేస్తోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కాజా వెంకట దిలీప్ చక్రవర్తిని, ఇతర నాయకులను గుప్తా అభినందించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ పరిపాలన అసోసియేట్ అన్నం సాయి సునీత, జిల్లా గవర్నర్ ఎం. హరిప్రసాద్, జోన్ పరిశీలకులు అరవిందుకుమార్, సూర్యప్రకాశరావు, కేశవరామారావు, కె. సురేష్కుమార్, ఎం. గోపాలకృష్ణ, సాయికుమార్, వేణు, బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సభ్యులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# భూముల ఇచ్చే వారికి రిటర్నబుల్ ప్లాట్లు



**గుంటూరు, ఆగస్టు 31(మనం న్యూస్ ప్రతినిధి) :** అమరావతి రెండో విడత భూ సమీకరణలు భాగంగా భూములు ఇచ్చే వారికి రిటర్నబుల్ ప్లాట్లను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు .తాడికొండ మండలం పెదపరిమిలో భూసమీకరణపై జరిగిన గ్రామసభలో తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్,పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతిని ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక నగరంగా తీర్చిదిద్దుటకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందుకుగాను రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి అందరికీ తెలిసిందేనని చెప్పారు. భూ సమీకరణకు అందరూ సహకరించాలని కోరారు. ఎక్కువ మంది రైతులు భూ సమీకరణకు భూములను అందిస్తే వెంటనే పనులను చేపట్టకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను చూపించడమే కాకుండా వాస్తవికంగా భూమిపైకి వచ్చి వాటి సరిహద్దులను సైతం చూపించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఆ మేరకు రిటర్నబుల్ ప్లాట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ భూ సమీకరణపై సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఒక గొప్ప కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పెదపరిమిలో రైతుల సందేహాల నివృత్తికి గ్రీవెన్స్ ను నిర్వహించారు.భూముల అందించిన వారికి సంబంధిత పత్రాలను అందజేశారు. రైతుల సందేహాలను జిల్లా కలెక్టర్ నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు అనధికారులు రైతులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల ఓటరు జాబితాపై గ్రామ సభలు నిర్వహించాలి



**గుంటూరు, ఆగస్టు 31(మనం ప్రతినిధి):** గ్రామ పంచాయతీల ఓటరు జాబితాపై గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల తుది ప్రచురణ సోమవారం (ఆగస్టు 31) చేయడం జరిగిందన్నారు. ఎస్.సి, ఎస్.టి ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 2వ తేదీ నాటికి విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా,పోలింగ్ కేంద్రాలు పట్ల ఈ నెల 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు .ఇందుకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అసౌకర్యాలు ఉండరాదని అన్నారు. అసౌకర్యాలు ఉంటే అందుకు ఎం.పి.డి.ఓలు బాధ్యత వహిస్తారని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పట్ల ప్రజల సంతృప్తి పెరగాలని,ఇందుకు సేవలు అందించడంలో అధికారులు,సిబ్బంది శ్రద్ధ వహించాలని అన్నారు.శాఖల వారీగా సేవలు,లోపాలు గుర్తించి వాటిని సరిదిద్దాలని స్పష్టం చేశారు.ఉన్న వసతులు సక్రమంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆధార్ - ఇ కెవైసి పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ భూపరిమితి చట్టం కింద ఉన్న కేసులను శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.యానాది కులం చిన్నారులకు ఆధార్ త్వరితగతిన జారీ చేయుటకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రీన్ గుంటూరులో నాటిన ప్రతి మొక్క బ్రతకాలని స్పష్టం చేశారు.నియోజక వర్గాల, మండల ప్రత్యేక అధికారులకు వారు తనిఖీ చేయాల్సిన అంశాలపై యాప్ ను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుతున్న అర్జీలు పక్కాగా, సంతృప్తికరంగా పరిష్కారం కావడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ లో భాగంగా దాదాపు 75 శాతం వరకు విచారణ పూర్తి అయిందన్నారు. మంగళగిరి, తాడికొండలలో ఇంకా వేగవంతం కావాలని స్పష్టం చేశారు.క్లెయిమ్ లను బూత్ స్థాయి అధికారుల వారీగా విచారణ చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.రీ సర్వే చేయడమే కాకుండా డేటా పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్,జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు,ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి,జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్,జిల్లా ఎస్.జి.ఎస్.డబ్ల్యు అధికారి ఆర్.రామలింగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగ ప్రగతికి డాక్టర్ వి. శ్రీధర్ చేసిన సేవలు చిరస్మరణీయం



▶▶ **తులసి ధర్మ చరణ్ (వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)**

**గుంటూరు అరండల్ పేట ఆగస్టు: 31( మనం న్యూస్ ప్రతినిధి )**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ వి. శ్రీధర్,పదవీ విరమణ మహోత్సవం గుంటూరు అరండల్ పేటలోని ఫెర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ విత్తన సంస్థ వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్,డాక్టర్ వి.శ్రీధర్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా తులసి ధర్మ చరణ్ మాట్లాడుతూ. వి. శ్రీధర్ వ్యవసాయ శాఖలో సుదీర్ఘ కాలం పాటు అందించిన సేవలు ఎంతో ప్రశంసనీయమైనవి. ఒక నిబద్ధత కలిగిన అధికారిగా, విద్యావేత్తగా ( బి ఎస్ సి.(ఏ జీ), ఎంబీఏ ఆయన రైతు సంక్షేమం కోసం, వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం కోసం అహర్నిశలూ శ్రమించారు. ప్రభుత్వ నిబంధనలను, ప్రైవేట్ భాగస్వామ్యాలను సమన్వయం చేస్తూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు సకాలంలో అందేలా ఆయన చేసిన కృషి మరువలేనిది'అని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతల నుండి విరమణ పొందినప్పటికీ, ఆయనకున్న అపారమైన అనుభవం,జ్ఞానం భవిష్యత్తులోనూ వ్యవసాయ రంగానికి,యువ శాస్త్రవేత్తలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు .డాక్టర్ వి.శ్రీధర్ మరియు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, ప్రశాంతమైన శేష జీవితాన్ని గడపాలని వేద సీడ్స్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# 43, 41 ఏళ్ల సుదీర్ఘ విశిష్ట పోలీసు సేవలకు ఘన సన్మానం



▶▶ **పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్**

**గుంటూరు ఆగస్టు: 31 (మనంప్రతినిధి):** గుంటూరు జిల్లా పోలీసు శాఖలో సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారులు ఎం. రవి కుమార్, ఎస్సై మరియు టి. శివరామ బాపయ్య, ఏఎస్ఐలకు జిల్లా పోలీసు శాఖ తరపున జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ , ఇతర పోలీసు అధికారులతో కలిసి ఘనంగా సన్మానం చేసి, ఆత్మీయ వీడ్కోలు పలికారు.

## నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో సేవలు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ సుదీర్ఘ సేవా కాలంలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు, పోలీసు శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. ముఖ్యంగా ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజం ప్రభావం ఎక్కువగా ఉన్న సవాళ్లతో కూడిన కాలంలో చట్ట పరిరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసించారు.ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించి,వారిని సమాజంలో ఉన్నత స్థాయికి చేర్చడం కూడా అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు.పోలీసు అధికారులు తమ సుదీర్ఘ సేవా కాలంలో విధులు నిర్వర్తించేందుకు సహకరించిన కుటుంబ సభ్యుల త్యాగాలు, సహకారం కూడా ఎంతో విలువైనవని పేర్కొంటూ వారికి ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## పదవీ విరమణ పొందుతున్న అధికారులు

1. ఎం. రవి కుమార్ - ఎస్సై1977 బ్యాచ్, గుంటూరుసర్వీసు: 43 సంవత్సరాలు2.టి.శివరామ బాపయ్య - ఏఎస్ఐ847 ఇఇఖి, గుంటూరుసర్వీసు: 41 సంవత్సరాలు సుదీర్ఘకాలం పోలీసు శాఖకు అందించిన వారి సేవలను జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని గుంటూరు జిల్లా ఎస్పీ తెలిపారు.పదవీ విరమణ అనంతరం వారు ఆరోగ్యంగా,ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని, వారి భవిష్యత్ జీవితం మరింత సంతోషకరంగా ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు.ఈ కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్,ఏఆర్ డీఎస్పీ శంకురయ్య, ఆర్ఐలు,ఎంటీ ఆర్ఐ శ్రీహరి రెడ్డి,అడ్మిన్ ఆర్ఐ కృష్ణయ్య, పోలీస్ అసోసియేషన్ నాయకులు సాంబశివరావు, ఎం.లక్ష్మయ్య, మాజీ అసోసియేషన్ ప్రెసిడెంట్ దలవాయి సుబ్రహ్మణ్యం, పీఆర్వో శ్రీనివాసరావు ,సహ ఉద్యోగులు,బంధువులు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వర్ల రామయ్యకి తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు



**విజయవాడ,ఆగస్టు31(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వర్ల రామయ్యని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మర్యాదపూర్వకంగా కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ భవానిపురంలోని వర్ల రామయ్య స్వగృహానికి వెళ్లిన తంగిరాల సౌమ్య, నందిగామ నియోజకవర్గానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులతో కలిసి ఆయనను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన వర్ల రామయ్యకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో, సామాజిక న్యాయం కోసం ఆయన అందిస్తున్న సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న వర్ల రామయ్యకి శాసన మండలి సభ్యత్వం లభించడం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు, ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని ఆమె తెలిపారు. శాసన మండలిలో వర్ల రామయ్య అనుభవం, ప్రజా సమస్యలపై ఉన్న అవగాహన రాష్ట్రానికి మరింత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ మర్యాదపూర్వక భేటీలో నందిగామ నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొని వర్ల రామయ్యకి శుభాకాంక్షలు తెలిపారు.

## పారిశుధ్య నిర్వహణలో ఆధునిక వాహనాలు, యంత్రాల వినియోగంతో మెరుగైన ఫలితాలు



**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

విజయవాడ,ఆగష్టు,31,(మనం న్యూస్): పారిశుధ్య నిర్వహణలో ఆధునిక వాహనాలు, యంత్రాలను విస్తృతంగా వినియోగించడం ద్వారా మెరుగైన పారిశుధ్య సేవలు అందించడంతో పాటు పారిశుధ్య కార్మికులపై పని భారాన్ని తగ్గిస్తూ నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరుస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బీఆర్టీఎస్ రోడ్, ఎర్రకట్ట రోడ్, కేటీ రోడ్, పాల ఫ్యాక్టరీ, జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, వన్టౌన్ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పాల ఫ్యాక్టరీ వద్ద ఎక్స్కవేటర్ సహాయంతో తేలియాడే వ్యర్థాలను తొలగిస్తున్న పనులను కమిషనర్ పరిశీలించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా రహదారుల శుభ్రత, కాలువల్లో పూడికతీత, వ్యర్థాల తొలగింపు తదితర పనులకు ఆధునిక వాహనాలు, యంత్రాలను వినియోగిస్తున్నామని తెలిపారు. రహదారులను శుభ్రం చేసేందుకు స్వీపింగ్ మెషిన్లు, కాలువల్లో పూడికతీతకు నాలా మ్యాన్, ఎక్స్కవేటర్లు, యూజీడీ సిల్టింగ్ మెషిన్లు, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు మిస్ట్ వాహనాలు వంటి ఆధునిక పరికరాలను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చి వినియోగిస్తున్నా మని కమిషనర్ పేర్కొన్నారు. వీటి వినియోగంతో పారిశుధ్య పనులు మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు కార్మికుల శ్రమను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆధునిక వాహనాలు, యంత్రాలను నిరంతరం వినియోగంలో ఉంచేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఏదైనా వాహనం లేదా యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లయితే వెంటనే మరమ్మతులు నిర్వహించి, తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని అన్నారు. తద్వారా పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా సేవలు అందించేందుకు వీలవుతుందని తెలిపారు. అనంతరం వన్టౌన్లోని గాంధీ మహిళా కళాశాల సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ను కమిషనర్ పరిశీలించారు. అన్న క్యాంటీన్కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా క్యాంటీన్లను తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీల సమయంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఎస్. శ్రీనివాస్, డిసిపి చంద్రబోస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాస్, గోపాలకృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## అంబారుపేట శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో హుండి కానుకల లెక్కింపు

నందిగామ,ఆగష్టు31(మనం న్యూస్): నందిగామ మండలం అంబర్పేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా 138 రోజులకు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల ద్వారా16,77,350/- రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో పీవీకే సీతారావమ్మ తెలిపారు, ఈ హుండీ కానుకల లెక్కింపులో ఆలయ కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు ధర్మకర్తల మండలి సభ్యులు, పరిటాల శ్రీ శివ సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.





## అమరావతి ఛాంపియన్షిప్‌లో... జిల్లా క్రీడాకారుల సత్తా

**13 స్వర్ణం, 12 రజత పతకాలు కైవసం**

**పతక విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష**



(విజయవాడ,మనం బ్యూరో):రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. క్రీడల్లో ప్రతిభను నిరూపించుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ వేదికలు, శిక్షణ, ప్రోత్సాహకాలు, వనరులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. 2026, ఆగస్టు 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన అమరావతి స్టేట్ లెవల్ ఛాంపియన్షిప్లో ఎన్టీఆర్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోని క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలు సాధించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, యోగా విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలంటే ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని.. రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.కోటేశ్వరరావు, కోచ్లు భాస్కర్ (బ్యాడ్మింటన్), నవీన్ కుమార్ (ఆర్చరీ), స్వామి (వెయిట్ లిఫ్టింగ్), ఇషాక్, చిరంజీవి (బాక్సింగ్), సంతోష్ (బాస్కెట్బాల్), ఆంజనేయులు, శిరీష (యోగా), క్రీడాకారులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంలో జిల్లాను ముందంజలో నిలపాలి



**గడువులోగా పరిష్కారంతో పాటు నాణ్యతకూ పెద్దపీట వేయాలి**

**అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేదు**

**జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 161 అర్జీలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ, ఆగష్టు,31,(మనం ప్రతినిధి): ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, నాణ్యమైన పరిష్కారం అందించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడం ద్వారా గ్రీవెన్స్ పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిసి సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ 46, పోలీస్ 23, పురపాలక పట్టణ అభివృద్ధి 23, పంచాయతీరాజ్ 10 అర్జీలతో సహా మొత్తం 161 అర్జీలు అందాయి. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అర్జీదారుని సమస్య వాస్తవంగా పరిష్కరించబడిందా, ఆయన సంతృప్తి చెందారా అనేదే అర్జీ పరిష్కారానికి అసలు గీటురాయి అని స్పష్టం చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు అర్జీలను కేవలం కార్యాలయ స్థాయిలో పరిశీలించకుండా స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిశీలించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, నిబంధనల మేరకు న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రత్యేకించి జిల్లాస్థాయి పీజీఆర్ఎస్కు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిష్కారం అనంతరం కూడా అర్జీదారుడి సంతృప్తి స్థాయిని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రజల సంతృప్తి, ఐవీఆర్ఎస్ ఫీడ్బ్యాక్, పరిష్కార నాణ్యతను ప్రధాన ప్రమాణాలుగా తీసుకుని అర్జీలను పరిష్కరించి, గ్రీవెన్స్ పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు అధికారులు సమిష్టిగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆదేశించారు.

**స్వచ్ఛాంధ్రలో జిల్లా మెరవాలి:**

స్వచ్ఛాంధ్ర-2026 అవార్డుల విషయంలో జిల్లాకు ఎక్కువ అవార్డులు సాధించేలా అధికారులు సమిష్టిగా కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రతి శాఖ, స్థానిక సంస్థ తమ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వాటి ఫలితాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఇక కఠిన చర్యలు



**▸▸ ప్లాస్టిక్ వినియోగం మానేద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం**

**▸▸ ప్రజలు, వ్యాపారులు సహకరించాలి**

**▸▸ కలెక్టర్ డీకే బాలాజీ**

చల్లపల్లి: ఆగస్టు 31, (మనం న్యూస్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో చల్లపల్లిలో నిర్వహించిన ప్లాస్టిక్ రహిత చల్లపల్లి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వద్దు.. కాటన్ సంచులే ముద్దు, ప్లాస్టిక్ వాడకం మానేద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం వంటి నినాదాలతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, అనంతరం ప్రజలు, విద్యార్థులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యారీ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులతో పాటు లోపల ప్లాస్టిక్ కోటింగ్ ఉన్న పేపర్ కప్పుల వినియోగాన్ని కూడా నియంత్రించాల్సి ఉన్నదన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించామని, చల్లపల్లిలో రెండు వారాల క్రితం సమావేశం నిర్వహించడంతో పాటు ప్రతిరోజూ ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని, ప్రజలు, వ్యాపారులు అధికారులకు సహకరించాలని కోరారు. పంచాయతీ అధికారులు, ఈవోలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ప్లాస్టిక్ నిషేధాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి చల్లపల్లిని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ పేరుకుపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి దోమల వృద్ధికి, తద్వారా వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మైక్రో ప్లాస్టిక్ కూడా పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారుతోందన్నారు. గతంలో మాదిరిగా ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వినియోగించాలని, టీ తదితర పానీయాలకు ప్లాస్టిక్ కోటింగ్ ఉన్న కప్పులకు బదులుగా పునర్వినియోగించగల పాత్రలను ఉపయోగించే అలవాటును తిరిగి తీసుకురావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతో చల్లపల్లిని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఎం ధనలక్ష్మి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డి.ఆర్.కె. ప్రసాద్, అవనిగడ్డ డివిజన్ డిఎస్పి ఆర్ అభిషేక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అభ్యుదయ కవి ఆరుద్ర 101వ జయంతి



**నందిగామ,ఆగష్టు31(మనం న్యూస్):** నందిగామ శాఖ గ్రంథాలయం నందు అభ్యుదయ కవి ఆరుద్ర 101వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు ఆరుద్ర చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అని ఈయన 19 25 ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించారని ఈయన మొదట మిలిటరీలో ఉద్యోగం చేశారని తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి ఆనందవాణి పత్రికకు సంపాదకులుగా పని చేశారని, సాహితీ రంగానికి ఎనలేని సేవలు చేశారని నాటక రచయితగా, చరిత్ర పరిశోధకుడిగా, సినీగీత రచయితగా పేరు సంపాదించారని ఈయన రచించిన వాటిలో సమగ్ర ఆంధ్ర సాహిత్యం 13 భాగాలు ముఖ్యమైనవి , త్వమే వాహం, కోనలమ్మ పదాలు, సినీవాలి, ఇంటింటి పద్యాలు, కవిత సంకలనాలు గాయాలు గేయాలు, పైలా పచ్చీసు, సినీ పాటల సంకలనం కొండగాలి తిరిగింది మొదలైనవి రచించి 1998లో మరణించినారని, ఆయనభౌతికంగా మన నుండి దూరమైన ఆయన కలం రాసిన పాటలు,తెలుగువారి హృదయాలలో ఎప్పటికీ సజీవంగా ఉంటాయని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు చిరుమామిళ్ల రామారావు, బచ్చు లక్ష్మణరావు, డోల నాయక్, విద్యార్థులు పాల్గొని ఆరుద్ర చిత్రపటానికి పుష్పాలు సమర్పించి నివాళులు అర్పించినారు.

## పిజిఆర్ఎస్ కు విశేష స్పందన




**నందిగామ,ఆగష్టు31(మనం న్యూస్):** ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నందిగామ ఆర్డీవో జి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నందిగామలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 17 వినతులు/ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. శాఖల వారీగా అందిన వినతుల వివరాలు: రెవెన్యూ - 12 ఎలక్ట్రిసిటీ -2 పోలీస్ - 1 ఎడ్యుకేషన్ - 1 సివిల్ సప్లయ్ - 1 ఆర్డీవో మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు వాస్తవస్థితి మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి అని తెలియజేయడమైనది

# ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో పరిష్కరించాలి



**▸▸ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఆగష్టు,31,(మనం న్యూస్): ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో స్వీకరించి, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సోమవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాలను కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గతంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కార పురోగతిని శాఖాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను పెండింగ్లో ఉంచకుండా, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు మూల కారణాలను గుర్తించి పరిష్కారం చూపాలని సూచించారు. మున్సిపల్ సేవల కోసం అందుబాటులో ఉన్న 'పురమిత్ర' యాప్లో నమోదవుతున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ఒక శాఖకు సంబంధించిన ఫిర్యాదును మరో శాఖకు బదిలీ చేస్తూ కాలయాపన చేయకుండా, అవసరమైన చోట శాఖల మధ్య సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 11 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించి అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలకు సంబంధించిన 4 ఫిర్యాదులు, ఇంజినీరింగ్ శాఖకు 3, పబ్లిక్ హెల్త్ విభాగానికి 2, రెవెన్యూ శాఖకు 1, స్పెషల్ సెల్ శాఖకు సంబంధించి 1 అందినట్లు కమిషనర్కు వివరించారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. తాత్కాలిక చర్యలతో సమస్యను ముగించకుండా, అదే సమస్య తిరిగి పునరావృతం కాకుండా అవసరమైన శాశ్వత చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం దరఖాస్తులుగా కాకుండా, నగర పాలనను మరింత మెరుగుపరిచేందుకు వచ్చిన సూచనలుగా పరిగణించాలని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పనితీరుతో విధులు నిర్వహించాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి. చంద్రశేఖర్, కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్చార్జ్) డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సజన, పర్యవేక్షణ ఇంజనీరు కె. దుష్యంత్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, జె.డి. అమృత్, బి. చిన్నపరెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.





## నందిగామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు
## మంజూరు చేయగలరని ఎమ్మెల్యే వినతి



- కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ని కలిసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య
- నూతన పోస్టల్ భవనం, గుడిమెట్ల రహదారి విస్తరణకు నిధుల కోసం విజ్ఞప్తి

**గుంటూరు,ఆగష్టు31(మనం న్యూస్)**: నందిగామ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మరోసారి తన చొరవను చాటుకున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గానికి అవసరమైన మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాల కల్పనకు నిధులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ని ఆయన కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి తంగిరాల సౌమ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నందిగామ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### నందిగామకు నూతన పోస్టల్ భవనం కోసం విజ్ఞప్తి

నందిగామ పట్టణానికి నియోజకవర్గంలోని నలుమూలల నుంచి ప్రతిరోజూ ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వస్తున్నారని, పట్టణంలో పెరుగుతున్న జనాభా మరియు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన పోస్టల్ భవనం మంజూరు చేయాల్సిన అవసరం ఉందని తంగిరాల సౌమ్య కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ కి వివరించారు.ప్రజలకు మెరుగైన పోస్టల్ సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవనం ఏర్పాటు ఎంతో అవసరమని ఆమె స్పష్టం చేశారు.

### 13 గ్రామాల ప్రయోజనానికి గుడిమెట్ల రహదారి విస్తరణ

అదేవిధంగా నందిగామ-గుడిమెట్ల రహదారి విస్తరణకు సీఆర్ఎఫ్ గ్రాంట్ కింద అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ రహదారి అభివృద్ధి పూర్తయితే నందిగామతో పాటు పరిసర ప్రాంతాల్లోని 13 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని తంగిరాల సౌమ్య వివరించారు.ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ మార్గాన్ని విస్తరించడం ద్వారా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు, వ్యాపార, వ్యవసాయ, విద్యా, వైద్య అవసరాల కోసం నందిగామకు వచ్చే ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని ఆమె తెలిపారు.

### కూటమి ప్రభుత్వంలో సమన్వయంతో అభివృద్ధికి బాటలు:

రాష్ట్ర ప్రభుత్వం-కేంద్ర ప్రభుత్వం మధ్య సమన్వయంతో నందిగామకు మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆమె స్పష్టం చేశారు.

## పెట్టుబడులకు అనువైన గమ్యం.. ఎన్టీఆర్ జిల్లా

- ఇన్వెస్టర్స్ డెస్క్ ప్రతిపాదనలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు సమష్టి కృషి
- డీఐఈపీసీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,ఆగష్టు,31,(మనం న్యూస్)**: ఎన్టీఆర్ జిల్లా పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన గమ్యస్థానమని.. పారిశ్రామిక వేత్తలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నామని, జిల్లా ల్యాండ్ బ్యాంకుపైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులు, భూముల లభ్యత తదితరాలపై చర్చించారు. 2026, మే 26 నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా శాఖల వారీ పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 258 దరఖాస్తులు రాగా.. వీటిలో ఇప్పటికే 226 దరఖాస్తులు ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు కలెక్టర్కు వివరించగా మిగిలిన దరఖాస్తులను కూడా త్వరితగతిన నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పారిశ్రామిక అభివృద్ధి విధానం (2015-20), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2020-23), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2023-27), ఈడీపీ (2024-29) పథకాల కింద ఎంఎస్ఎంఈ రంగానికి అందించే పెట్టుబడి రాయితీ, వడ్డీ, విద్యుత్ బిల్లుల రీయింబర్స్మెంట్ వంటి ప్రోత్సాహకాలలో భాగంగా 22 క్లెయిమ్లకు రూ. 3.24 కోట్లు మేర ప్రతిపాదనలను తాజాగా చర్చించి డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అవసరమైన భూముల లభ్యతపై వేగంగా సమాచారం అందించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూముల కేటాయింపు ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి చొరవచూపుతున్నట్లు తెలిపారు. 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నవంబర్లో విశాఖపట్నంలో జరగనున్న నేపథ్యంలో విజయవాడలో అక్టోబర్లో రీజనల్ పార్టనర్షిప్ సమ్మిట్ జరుగుతుందని.. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

### ర్యాంప్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక చర్యలు:

ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పోటీతత్వాన్ని పెంచేందుకు రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్) కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 2న విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్షాప్ భారీ ఎత్తున జరగనుందని.. ఇందులో ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, వి.మురళీకృష్ణ (ఫ్యాప్సియా), కనకదుర్గ (అలెప్), ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్



**గుంటూరు మంగళగిరి: ఆగస్టు 31 (మనం న్యూస్ ప్రతినిధి)** రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ సోమవారం మంగళగిరిలోని 6వ బెటాలియన్ ఏపీఎస్పీ పోలీస్ పరేడ్ గ్రౌండ్ ను పరిశీలించారు.రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 6వ బెటాలియన్ పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఘనంగా నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, యూనిట్లకు చెందిన పోలీస్ క్రీడాకారులు,క్రీడాభిమానులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో వారికి అవసరమైన భద్రత,పార్కింగ్,తాగునీరు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు మరియు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఎస్పీ అధికారులతో సమీక్షించారు. వివిధ వేదికల్లో క్రీడా పోటీలు.రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్లో భాగంగా వివిధ క్రీడా పోటీలను పలు ప్రాంతాల్లో నిర్వహించనున్నారు.

### అమరావతి విట్ కాలేజీలో ఇండోర్,అవుట్డోర్ క్రీడలు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో ట్రాక్ అండ్ ఫీల్డ్కు సంబంధించిన పోటీలు.మంగళగిరిలో స్విమ్మింగ్ పోటీలు.కృష్ణా నదిలో వాటర్ స్పోర్ట్స్కు సంబంధించిన ఈవెంట్లు.తాడేపల్లి నులకపేటలోని ఫైరింగ్ రేంజ్లో షూటింగ్, ఫైరింగ్కు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ప్రతి ఏర్పాటును క్షుణ్ణంగా పరిశీలించి,కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ,సమన్వయం మరియు క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాసు,ఆర్ఐ వెల్ఫేర్ సురేష్ బాబుతో పాటు 6వ బెటాలియన్ ఏపీఎస్పీ అధికారులు పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.

## విజయవాడ నగరంలో ఎస్సీ, మైనారిటీలకు న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాలి



**గాంధీనగర్, ఆగస్టు 31, మనం న్యూస్**: విజయవాడ నగరంలో ఎస్సీ , మైనారిటీ వర్గాలకు న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యం, నిర్ణయాధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించాలని మన్నం రాజశేఖర్ గుడివాడ రాజా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, మైనారిటీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నగర పాలనలో వారికి తగిన ప్రాతినిధ్యం మరియు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, రాజకీయ పార్టీలపై ఉందన్నారు. రాబోయే విజయవాడ మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, చట్టబద్ధంగా మరియు సామాజిక న్యాయానికి అనుగుణంగా జరగాలని ఆయన కోరారు. విజయవాడ నగరంలోని ఎస్సీ, మైనారిటీలు అధికంగా నివసించే ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, మైనారిటీ యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరించాలని కోరారు. ఎస్సీ, మైనారిటీలు కేవలం ఓటర్లు కాదు. వారు కూడా నగర పాలనలో భాగస్వాములు. వారికి రాజ్యాంగబద్ధమైన హక్కులు, గౌరవప్రదమైన రాజకీయ ప్రాతినిధ్యం మరియు అభివృద్ధిలో సమాన అవకాశాలు కల్పించాలి అని మన్నం రాజశేఖర్ గుడివాడ రాజా స్పష్టం చేశారు. విజయవాడ నగర మేయర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని సీరియస్గా పరిగణించి ఎస్సీ, మైనారిటీలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రజ్వల హోమ్,ఆశాజ్యోతిలో విందు భోజనాలు

**హనుమాన్ జంక్షన్: ఆగస్ట 31 ( మనం న్యూస్ )**: సెప్టెంబర్ 2 తారీకు జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా హనుమాన్ జంక్షన్ జనసేన పార్టీ నాయకులు,సాయినాథ్ హోటల్ అధినేత అల్లాడౌట్టి నాగేశ్వరావు ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ ఆర్ టీ సి బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సాయినాథ్ హోటల్ వద్ద జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు.అనంతరం హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ లో ఉన్న ఆశాజ్యోతి హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ లోని 80 మంది దివ్యాంగు బాలబాలికలకు విందు భోజనం.అలాగే గుడివాడ రోడ్ లోని ప్రజ్వల హోమ్ లో ఉన్న 60 మంది నిర్భాగ్యులకు విందు భోజనం ఏర్పాటు చేస్తున్నారు.ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు అలాగే కూటమి నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అల్లాడౌట్టి కోరారు.



# ప్రతి ఫిర్యాదుకు చట్టబద్ధమైన పరిష్కారం..



- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా చర్యలు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- (పి జి ఆర్ ఎస్)లో 155 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ

**గుంటూరు ఆగస్టు31 (మనంప్రతినిధి) :** నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలు,ప్రతి పిటిషన్ పూర్తి విచారణ తర్వాత జరిగిన విషయం ఫిర్యాదీ కి తెలియజేయాలి. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పి జి ఆర్ ఎస్) ద్వారా అందే ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో ఎస్పీ 155 ఫిర్యాదులను స్వయంగా, అలాగే ఇతర పోలీస్ అధికారుల ద్వారా స్వీకరించి, ఒక్కో వినతిని పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షికంగా విచారణ జరిపి,వాస్తవాలను నిర్ధారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదులను వెంటనే ఆన్లైన్ విధానంలో సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి,నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత ఫిర్యాదుదారునికి సమాచారం అందించి, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాతే పిటిషన్ను ముగించాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకుండా,సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. (పి జి ఆర్ ఎస్) కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో జిల్లా పోలీస్ సిబ్బంది సహకారం అందించి,తమ సమస్యలను సులభంగా తెలియజేసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా గుంటూరులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్,సాయినగర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, వృద్ధులు, నిరుపేదలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని పేర్కొంటూ ట్రస్ట్ ప్రతినిధులను ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ,అదనపు ఎస్పీ రమణమూర్తి,సౌత్ డీస్పీ పూర్ణచంద్ర రావు,ఈస్ట్ డీస్పీ టీ సీతారాం (పి జి ఆర్ ఎస్) సీఐ బిలాలుద్దీన్తో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సార్.. మా డబ్బులు మాకు ఇవ్వండి




**గుంటూరు ఆగస్టు: 31 (మనం న్యూస్ ప్రతినిధి) :** మా డబ్బులు.. మాకు ఇవ్వండి సీఎం సార్.అంటూ ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగులు సోమవారం గుంటూరులో ఆందోళన చేపట్టారు. గుంటూరు కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమం లో సీఎం సార్. మా డబ్బులు.మాకు ఇవ్వండి అంటూ నినాదాలు చేస్తు ఉద్యోగులు ర్యాలీ గా వచ్చి కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.కూటమి ప్రభుత్వం తమకు ఇవ్వవలసిన బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.తమ జీతాల్లో ప్రభుత్వం వద్ద దాచుకున్న డబ్బులు మాత్రమే తాము అడుగుతున్నామని ఏపీ జేఏసీ అమరావతి గుంటూరు జిల్లా ఛైర్మన్ కిరణ్ కుమార్ అన్నారు. కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ తమకి రావాల్సిన పెండింగ్ డీఏలు విడుదల చేయాలన్నారు. కొందరు మంత్రులు ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగులను రెచ్చగొడుతుందని మాట్లాడడం సరైన విధానం కాదన్నారు.ఈ ఆందోళన కార్యక్రమంలో పలు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# మంచంలో జీవచ్ఛవంలా పడివున్న పేదలకు ప్రత్యేక కేటగిరిలో పింఛన్ మంజూరు చేయాలి

- అనారోగ్య బాధితుల పట్ల మానవత్వం చూపండి
- బాధితుల పక్షాన డీ ఆర్ ఓ షేక్ ఖాజావలికి వినతిపత్రం ఇచ్చిన జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి



**గుంటూరు ఆగస్టు : 31 (మనం న్యూస్ ప్రతినిధి):**అనారోగ్య కారణాలతో , అనుకోని ప్రమాదాలతో మంచాలకే పరిమితమై జీవచ్ఛవంలా పడివున్న పేదలకు ప్రత్యేక కేటగిరి కింద పింఛన్ లు మంజూరు చేయాలని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు.ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా గ్రీవెన్స్ లో డీ ఆర్ ఓ షేక్ ఖాజావలి కి అయన బాధితులతో కలిసి వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు.ఇప్పటివరకు కేవలం సామాజిక పింఛన్ లకే లక్షా ముప్పై ఆరు వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు.ఈ నేపథ్యంలో పూర్తి అంగ వైకల్యం మరియు క్యాన్సర్ వంటి మహమ్మారిల బారిన పడి మంచాన పడి దీనావస్థలో ఉన్నవారిని ప్రత్యేకంగా ఆదుకోవాలని కోరారు.వ్యాధి గ్రస్థుల మందులకు సహాయకులకు కాస్త ఆర్థిక వెసులుబాటు కల్పించి వారికీ బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని అధికారులను ఆళ్ళ హరి కోరారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణ శంకుస్థాపన చేసిన ఎంపీ పెమ్మసాని ఎమ్మెల్యే రామాంజనేయులు



**గుంటూరు పత్తిపాడు ఆగస్టు 31 (మనం న్యూస్ ప్రతినిధి)** పత్తిపాడు నియోజకవర్గ పెదనందిపాడులో స్థానిక ఎమ్మెల్యే. బూర్ల.రామాంజనేయులు తో కలిసి 15వ ఆర్థిక సంఘ నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ ప్రజలకు వైద్య సదుపాయాలు, ప్రసవ సదుపాయాలు, ప్రాథమిక చికిత్సలు అందుబాటులో ఉండే విధంగా ఒకటి పాయింట్ రూ. 1.93 కోట్ల నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే తో కలిసి శంకుస్థాపన నిర్వహించడం జరిగింది.జిజిహెచ్ వంటి జిల్లా ప్రధాన ఆసుపత్రిపై లోడ్ ఎక్కువ పడకుండా ఇలాంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల సమస్యలకు ప్రధాన పరిష్కార మార్గంగా పనిచేసినప్పుడే గ్రామ గ్రామానికి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. గతంలో నిర్మించినటువంటి భవనం రూఫ్, స్లాబ్స్ సరిగా నిర్మాణం కాకపోవడం వలన అలాగే ఉప్పునీటి సమస్య కారణంగా భవన నిర్మాణం పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడం జరిగింది.ఆ సమస్యకు ప్రత్యామ్నాయంగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మేము శ్రీకారం చుట్టాము.ప్రజలు కూడా ఈ నిర్మాణంలో భాగస్వామ్యులు అయి ఈ నిర్మాణం మనది అనే భావనతో దగ్గరుండి పర్యవేక్షించి,నిర్మాణానంతరం కూడా నిర్వహణ విధానాన్ని గమనిస్తూ ఉండాలి.ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ.గత వైసిపి పాలనలో ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్లక్ష్యానికి గురైంది.చిన్న చిన్న మరమ్మతులు ఉన్నాయని ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వాళ్ళు లేరు.చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైంది.దీంతో నూతన భవన నిర్మాణం అవసరం ఏర్పడింది.కాగా పెమ్మసాని చంద్రశేఖర్ , చొరవతో ఈ భవనానికి రూ. 1.93 కోట్ల నిధులను సమకూర్చడం జరిగింది. అలాగే గుంటూరు ఛానల్ ఎక్స్టెన్షన్ రూ. 275 కోట్లు, గుంటూరు ఛానెల్ విస్తరణ పనులకుగానూ మరిన్ని కోట్లతో నిధులు సమకుర్చడంతో పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కే విజయలక్ష్మి పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేట రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ప్రభుత్వం

- రూ. 10 లక్షల పరిహారం చెక్కుల అందజేత

**పల్నాడు చిలకలూరిపేట ఆగస్టు : 31 (మనం న్యూస్ ప్రతినిధి):** చిలకలూరిపేట వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది.ఈ దుర్ఘటనలో మృతి చెందిన వేలూరు గ్రామానికి చెందిన 8 మంది దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు,బాధిత కుటుంబాలకు సంబంధించిన పరిహారం చెక్కులను సోమవారం పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు , స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు,జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా,మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి,ఎంపీ తీవ్ర దిగ్భ్రాంతి.ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మరియు పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు,తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తమ సానుభూతిని తెలిపారు. ఘటనపై తక్షణ నివేదిక తెప్పించుకున్న సీఎం, మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించి,నేడు చెక్కుల పంపిణీ పూర్తి చేయించారు.



# పి జి ఆర్ ఎస్ పిర్యాదులను పూర్తి స్తాయిలో పరిష్కరించి, అవి మరల పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని నగర కమిషనర్




**గుంటూరు నగరపాలక సంస్థ ఆగస్టు : 31( మనం న్యూస్ ప్రతినిధి )**పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని,పిర్యాదులను పూర్తి స్తాయిలో పరిష్కరించి, అవి మరల పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ నగర పాలక సంస్థ విభాగాదిపతులను ఆదేశించారు.సోమవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాదాన్యతనిస్తుందని, అధికారులు కూడా ప్రజల నుండి అందిన పిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు.సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని, పిజిఆర్ఎస్,ఇతర వేదికల ద్వారా ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కార పురోగతిపై విభాగాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పీజిఆర్ఎస్ ద్వారా 49 అర్జీలు అందాయని,వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 21, రెవెన్యూ విభాగం 9, ప్రజారోగ్య విభాగం 5, ఉపా సెల్ విభాగం 2 , అకౌంట్స్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు.కార్యక్రమంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, డిసిపి సూరజ్ కుమార్, ఏఓ తిరుపతి నాయుడు, మేనేజర్ బాలాజీ బాషా,విభాగాధిపతులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరునామ శంఖుచక్రాల ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహణ



గుంటూరు లాల్ పురం ఆగస్టు 31 (మనం న్యూస్ ప్రతినిధి) గుంటూరు రూరల్ మండలం, లాల్ పురం గ్రామంలో ఆధ్యాత్మికతకు, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరునామ శంఖుచక్రాల ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో,వేదమంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనే యులు పాల్గొన్నారు. ఈ పవిత్ర మహోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్చార ణలు, మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.శ్రీ వెంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులు ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలి.ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ప్రతి హృదయంలో భక్తి,ప్రతి గ్రామంలో శాంతి నెలకొనాలి ఎమ్మెల్యే రామాంజనేయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ

గుంటూరు, ఆగస్టు 31 : (మనం న్యూస్ ప్రతినిధి)ః ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం నాణ్యతతో కూడినదై ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు.ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల సత్వర పరిష్కారం కోసం అర్జీలను అందజేస్తుంటారని వారి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలన్నారు.అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యంకాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు.ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ ఎన్ ఎస్ కె ఖాజావలి,డ్వామా పిడి శంకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి, డి పి ఓ సాయి కుమార్,జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ,డిటిసి సీతారామి రెడ్డి ,జిల్లా ఉపాధి కల్పనా అధికారి అభినవ్ ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హాఫ్ మారథాన్ (21 కి.మీ) లో పాల్గొని కంప్లీట్ చేసిన హోంగార్డు 351,జి కృష్ణ కిషోర్ ను అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు ఆగస్టు : 31 (మనం న్యూస్ ప్రతినిధి )ఈ నెల ఆగస్ట్ -2026 30, వ తేదీ లో హైదరాబాద్లో నిర్వహించిన ఎన్.ఎం.డి.సి హైదరాబాద్ మారథాన్ పరుగు - 2026 పందెంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్ గా పనిచేస్తున్న జి. కృష్ణ కిషోర్ పాల్గొని అసాధారణమైన 21 కిలోమీటర్ల పూర్తి మారథాన్ పరుగును కేవలం గంటలు 1. 40 నిముషాలు 50 సెకన్లో పూర్తి చేసి, 87 ర్యాంక్ సాధించారు.దాదాపు 6394 మంది పాల్గొన్న ఈ పూర్తి మారథాన్ పరుగులో పాల్గొని కేవలం 1 గంట,40 నిముషాలు 50 సెకన్లో పరుగును పూర్తి చేసిన హోంగార్డు కిషోర్,జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలవగా, హోంగార్డును అభినందించినారు,గుంటూరు జిల్లా పోలీసు తరుపున మీరు ఈ పరుగును పూర్తి చేయడం సంతోషంగా ఉందని,భవిష్యత్తులో మరిన్ని మార థాను లో పాల్గొని పతకాలు సాధించాలని ఎస్పీ ప్రోత్సహించారు.

## పేట వాసులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాద వాతావరణం కల్పించేలా ఊర చెరువు అభివృద్ధి



జగ్గయ్యపేట ఊర చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినశ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

జగ్గయ్యపేట ఆగస్టు 31 మనం న్యూస్: పేట వాసులకు ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణం అందించేలా ఊర చెరువును అభివృద్ధి చేయనున్నట్లు శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తెలిపారు. జగ్గయ్యపేట పట్టణానికి ప్రతిష్టాత్మకంగా నిలిచే ఊర చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘువేంద్ర కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అమృత్ 2.0 పథకం కింద సుమారు రూ.3.90 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను మేఘా ఇన్ఫ్రా సంస్థ చేపట్టనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ జగ్గయ్యపేట ఊర చెరువును పట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. చెరువులోని కలుపు మొక్కలు, గుర్రపు డెక్కను తొలగించడం, ఇప్పటికే ఉన్న కట్టను బలోపేతం చేయడం, కొత్త కట్ట నిర్మించడం, అవసరమైన ప్రాంతాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, పచ్చదనం పెంపొందించడం, సెడిమెంటేషన్ ట్యాంక్ నిర్మించడం వంటి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. బుద్ధ విగ్రహం నుంచి కృష్ణని గుడి, మెయిన్ బైపాస్ రోడ్ అలుగు మీదుగా ఆంజనేయస్వామి ఆలయం వరకు అనుసంధాన మయ్యేలా వాకింగ్ ట్రాక్ను అభివృద్ధి చేయనున్నామని, ఒక పూర్తి రౌండ్ సుమారు 3.25 కిలోమీటర్ల మేర ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాకర్స్తో పాటు ప్రకృతి ప్రేమికులు, కుటుంబాలు, పిల్లలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా ఊర చెరువును తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 2 లేదా 3 ప్రాంతాల్లో ఓపెన్ జిమ్లు, ప్రత్యేకంగా పంచతత్వ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రణాళిక చేస్తున్నామని ఎమ్మెల్యే రాజగోపాల్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘువేంద్ర మాట్లాడుతూ, ఊర చెరువు అభివృద్ధి ప్రాజెక్టు జగ్గయ్యపేట మున్సిపాలిటీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటని అన్నారు. 3.25 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్తో పాటు పంచతత్వ వాక్, గ్రీనరీ, అందమైన లైటింగ్ వంటి సదుపాయాలతో చెరువును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్లో ఫ్లోటింగ్ ఫౌంటైన్లు తదితర సదుపాయాలను దశలవారీగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆరు నెలల్లో పనులను పూర్తి చేసే లక్ష్యంతో పనులు కొనసాగుతాయని వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ , గ్రూప్-ఐ అధికారి, ప్రాజెక్టును మరింత సుస్థిరంగా, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు పలు వినూత్న ఆలోచనలను అమలు చేయడానికి కృషి చేస్తున్నారని చైర్మన్ తెలిపారు. దీంతో ఊర చెరువు కేవలం వాకింగ్ ప్రదేశంగా కాకుండా పిల్లలు, యువత, కుటుంబాలు ఆహ్లాదంగా గడిపే సమగ్ర ప్రజా ప్రదేశంగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధికి ఇంతటి భారీ నిధులను తీసుకువచ్చి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి చైర్మన్ రంగాపురం రాఘువేంద్ర ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ప్రజలు అందిస్తున్న సహకారానికి కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ , ఈ శివ కోటేశ్వరరావు, ప్రవీణ్, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, మేఘా ఇన్ఫ్రా ఇంజినీర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నెరవేరబోరిన పూల సుబ్బయ్య ఉద్యమ కల

వెలిగొండ,ఆగష్టు31(మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్లోని వెలిగొండ ప్రాజెక్టుకు 'పూల సుబ్బయ్య' పేరు పెట్టడంతో ఆయన ఎవరనే చర్చ జరుగుతోంది. పూల సుబ్బయ్య మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు నేత. 1929 జూన్ 29న కంభంలో జన్మించిన ఆయన 1962, 1967లో ఎర్రగొండపాలెం, 1978లో మార్కాపురం ఎమ్మెల్యేగా గెలిచారు. పశ్చిమ ప్రకాశానికి సాగు, తాగునీరు అందించేందుకు వెలిగొండ ద్వారా కృష్ణా జలాలను తరలించాలని ఉద్యమించారు. ఆయన సేవలకు గుర్తింపుగా అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య పేరు పెట్టారు.

## కాంద్రపాడు మాస్టారుకు గ్రామస్థుల సన్మానం



నందిగామ,ఆగష్టు31(మనం న్యూస్)ః కాంద్రపాడు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన మాస్టారు కందుల సుధాకర్ పదవీ విరమణ చేశారు. దీంతో ఆయనను గ్రామస్థులు సన్మానించారు. పాఠశాలలో మౌలిక వసతులు లేని సమయంలో సహచర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దల సహకారంతో పాఠశాల రూపురేఖలు మార్చారని తెలిపారు. ఉన్నతమైన ఆలోచనలతో విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఆయన సేవలతో పాఠశాలకు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.

## హైవే పై యువత బైక్ విన్యాసాలు



నందిగామ,ఆగష్టు31(మనం న్యూస్): నందిగామలో కొందరు యువత బైక్ రైడింగ్తో రెచ్చిపోతున్నారు. చందాపురం బైపాస్ సర్వీస్ రోడ్డుపై కాలేజీ విద్యార్థులు అతివేగంగా బైకులు నడపడమే కాకుండా.. రోడ్డుపైనే స్టంట్లు చేస్తూ హల్చల్ చేశారు. బైకులపై స్టంట్లు చేస్తుండటంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# విజయవాడలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**

**జగ్గయ్యపేట ఆగస్టు 31 మనం న్యూస్:** సెప్టెంబర్ రెండో తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినవేడుకలు నిర్వహణకు ఎన్ టీ ఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్ టీ ఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఆర్ టీ సీ వర్క్ షాప్ రోడ్డు నందు జిల్లా కార్యాలయం నందు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వేడుకలు నిర్వహణ, జనసేన పార్టీ యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. మొదటిగా జనసేన పార్టీ యువజన విభాగం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆన్లైన్ వేదికగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యువజన విభాగం ఏర్పాటు యొక్క ఉద్దేశం లక్ష్యాలు, యువతులు రాజకీయ చైతన్యము తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు కూడా దేశాన్ని ఉద్దేశం చేస్తారని స్పష్టం చేశారు. విజయవాడ నగర వ్యాప్తంగా ఉన్న జన సైనికులు అందరూ కూడా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన భారీ స్క్రీన్ ద్వారా ఎన్టీఆర్ జిల్లా జనసైనికులకు దిశా నిర్దేశం చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ నగరవ్యాప్తంగా, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో భారీ ఎత్తుకున్న స్క్రీన్లు ఏర్పాటు చేసి, పవన్ కళ్యాణ్ యువజన విభాగ ఆవిష్కరణ యొక్క దిశా నిర్దేశంతో పాటు, సేవా కార్యక్రమాలతో పార్టీ అధినేత పుట్టినరోజు వేడుకలు కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ మండలి రాజేష్ , జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జీ అమ్మిశెట్టి వాసు , సెంట్రల్ నియోజకవర్గం ఇంచార్జీ బొల్లిశెట్టి వంశీ , తిరువూరు నియోజకవర్గ ఇంచార్జీ మనుబోలు శ్రీనివాసరావు , సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ , సెంట్రల్ ఆంధ్ర జోన్ కో కన్వీనర్ కొప్పిరెడ్డి సూర్యనారాయణమూర్తి , వీరమహిళలు రావి సౌజన్య , తిరుపతి అనూష తదితరులు పాల్గొన్నారు.

# బొల్లా బాబుప్రసాద్ సేవలు చిరస్మరణీయం



**విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీబ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్**

**జగ్గయ్యపేట ఆగస్టు 31 మనం న్యూస్:** తాళ్లూరు గ్రామ సర్పంచ్ గా గ్రామాభివృద్ధికి పార్టీ అభివృద్ధికి గొల్ల బాబు ప్రసాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని పార్టీ పట్ల ఆయనకున్న అంకిత భావం ప్రతి కార్యకర్తకు ఆదర్శనీయమని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేసినేని శివనాద్ ( చిన్ని), శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ,కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, లు అన్నారు. వత్సవాయి మండలం, తాళ్లూరు గ్రామ మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన కీ.శే. బొల్లా బాబుప్రసాద్ విగ్రహాన్ని సోమవారం గ్రామ ప్రధాన కూడలిలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) , జగ్గయ్యపేట శాసనసభ్యులు, టీడీపీ పొలిట్బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురామ్ ఆవిష్కరించారు. అనంతరం బాబుప్రసాద్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దశదిన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సంతాప సభలో పాల్గొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ బొల్లా బాబుప్రసాద్ గ్రామానికి చేసిన సేవలు, తెలుగుదేశం పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం చిరస్మరణీయమని కొనియాడారు. 1954లో జన్మించిన బాబుప్రసాద్ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన 1983 నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, చివరి వరకు తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారని తెలిపారు. గ్రామ సర్పంచ్గా మూడు పర్యాయాలు సేవలందించిన బాబుప్రసాద్ , అందులో రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా, మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించి గ్రామ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని గుర్తు చేశారు. అలాగే స్థానిక సంస్థల వ్యవస్థలో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు బాబుప్రసాద్ ఎంతో కృషి చేశారని పెద్దలు పేర్కొన్నారు. గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తూ ప్రజలతో మమేకమై పనిచేశారని తెలిపారు.ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. బొల్లా బాబుప్రసాద్ పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన సీనియర్ నాయకులని, గ్రామ ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి సేవా దృక్పథంతో పనిచేశారని అన్నారు. ఆయన మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ... బాబుప్రసాద్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని పనిచేసిన సీనియర్ నాయకుల్లో బాబుప్రసాద్ ఒకరని అన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తిగా ఆయన సేవలు గుర్తుండిపోతాయని తెలిపారు. ఆయన ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని నేటి నాయకులు, కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కె డీసీసీబ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురామ్ మాట్లాడుతూ బాబుప్రసాద్ గ్రామ ప్రజల అభిమానం పొందిన నాయకులని, సర్పంచ్గా, తెలుగుదేశం పార్టీ నాయకుడిగా ఆయన అందించిన సేవలు తాళ్లూరు గ్రామ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ హోం మంత్రివసంత నాగేశ్వరరావు ,గ, మాజీ శాసనసభ్యులు బొద్దులూరి రామారావు , వడ్లమూడి రాంబాబు, జొన్నలగడ్డ రాధాకృష్ణ మూర్తి, కొరారు సత్యనారాయణ ప్రసాద్, కట్టా వెంకట నరసింహారావు, తొండపు జగన్మోహన్ రావు, మల్లెల గాంధీ, రేపాల మోహన్ రావు,చెరుకూరి రాజేశ్వరరావు, ఏపూరి నాగశ్రీను, మన్నె కళావతి, తోట నాగమల్లేశ్వరరావు, చిట్టూరి రమేష్, వెల్ది శ్రీనివాసరావు, షేక్ సోధ్, బి.రామకృష్ణ,చావా నాగేశ్వరరావు, చిట్టూరి సుభాష్, లగడపాటి బాబీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బాబుప్రసాద్ కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జగ్గయ్యపేటలో కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన బ్రాంచ్ను ప్రారంభించిన సామినేని ఉదయభాను




**జగ్గయ్యపేట ఆగస్టు 31 మనం న్యూస్:** జగ్గయ్యపేట పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో ఉన్న పద్మావతి కాంప్లెక్స్లో కరూర్ వైశ్య బ్యాంక్ నూతనంగా ఏర్పాటు చేసిన జగ్గయ్యపేట 904వ బ్రాంచ్ను ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ యాజమాన్యానికి, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. బ్యాంక్ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సామినేని ఉదయభాను తనయులు యువనేత సామినేని ప్రశాంత్, పలువురు ప్రముఖులు నేతలు పాల్గొన్నారు.

# హత్య కేసులో 11 మంది నిందితుల అరెస్ట్



**గుంటూరు,ఆగష్టు31(మనం న్యూస్):** గుంటూరు నగరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి హత్య కేసులో 11 మంది నిందితుల అరెస్ట్ హత్యకు ఉపయోగించిన 2 వాహనాలు మరియు కత్తి స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పెండ్రాల వెంకన్న చిన్న కాకులోడు హత్య కేసులో నగరంపాలెం పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి మొత్తం 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, పాత కక్షలు మరియు ప్రతీకార భావంతో నిందితులు వెంకన్న చిన్నను హత్య చేయడానికి పథకం రూపొందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 29.08.2026 తేదీన వెంకన్న తన కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరుకు వచ్చిన విషయం తెలుసుకున్న నిందితులు, అతని కదలికలను గమనిస్తూ అవకాశం కోసం ఎదురుచూశారు. 30.08.2026 ఉదయం సుమారు 09.00 గంటల సమయంలో, కే వి పి కాలనీ 1/7వ లైన్ ప్రాంతంలో వెంకన్న చిన్నను నిందితులు అడ్డగించి దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడు కత్తితో దాడి చేయగా, మరికొందరు నిందితులు కర్రలు మరియు చేతులతో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో: 1. పెండ్రాల ఇమ్మానుయేలు రాజు 2. పెండ్రాల అమూల్య రాజు 3. పెండ్రాల దేవరాజు 4. పెండ్రాల గురవయ్య 5. పెండ్రాల శ్యామ్ 6. పెండ్రాల బుజ్జి 7. పెండ్రాల జమాలమ్మ 8. పెండ్రాల రాజ్ కుమార్ రాజు 9. బత్తుల మోషే రాజు మోషే 10. దేవరకొండ షాలేమ్ రాజు సలీమ్ 11. ఇరుగు బాబు అనే మొత్తం 11 మంది నిందితులను 30/31.08.2026 అర్ధరాత్రి సుమారు 01.45 గంటలకు అరెస్ట్ చేశారు. అరెస్టుకు తెలియజేశారు. గల కారణాలను నిందితులకు చట్టప్రకారం నిందితుల విచారణలో వారి వద్ద ఉన్న వాహనాల వివరాలు వెలుగులోకి రావడంతో, నేరానికి ఉపయోగించిన అ్క40ఔఎ2414 నంబరు గల ఏఊ ౄఞ్ఞూౖ మోటార్ సైకిల్ మరియు అ్క40ఉఖ0183 నంబరు గల అ్జు ౖఞ్జూట్చట ౢాఖీ-125 మోటార్ సైకిల్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, నిందితుడు ఇమ్మానుయేలు రాజు చూపించిన ప్రదేశంలో దాచి పెట్టిన నేరానికి ఉపయోగించిన పదునైన కత్తిని సోమవారం ఉదయం పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరు వ్యక్తుల ప్రమేయం, నేరానికి ఉపయోగించిన ఇతర వాహనాలు మరియు ఇతర ఆధారాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

**ప్రజలకు విజ్ఞప్తి.**

పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలు హింసాత్మక ఘటనలకు దారితీయకుండా ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలి.

# జగ్గయ్యపేట వాగ్దేవి కళాశాలలో వనం మనం



**జగ్గయ్యపేట ఆగస్టు 31 మనం న్యూస్:** భావితరాలను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పరిసరాలను పచ్చదనం పరిశుభ్రతతో ఉండేలా ప్రతి ఒక్కరు చూసుకోవాలని వాగ్దేవి కళాశాల చైర్మన్ బుస్సా సురేష్ అన్నారు. పట్టణంలో వాగ్దేవి కాలేజీ ఆవరణలో. వాగ్దేవి మహిళా కళాశాల ప్రిన్సిపాల్. బుస్సా సరిత పుట్టినరోజు శుభ సందర్భముగా వారిని విద్యార్థులు శాలువాతో సత్కరించి మొక్కను బహుమతిగా అందించటం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఉసిరి మొక్కను నాటడం జరిగింది. ప్రతి ఒక్కరు పుట్టినరోజు . తదితర ముఖ్యమైన రోజులలో ఒక్కొక్క మొక్క నాటి వనములు గా మార్చాలని తద్వారా వాతావరణం మార్పుల వల్ల వర్షములు పడటం పాడిపంటలు సమృద్ధిగా పడటంతో రైతు తద్వారా ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడం పచ్చదనం పరిశుభ్రత సంబంధించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను వాడటం తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందిస్తూ ఇంటి అవసరాలకు నార సంచులను వాడటం వాహన కాలుష్య నివారణకు వాహనాలను కాకుండా సైకిల్ ఎక్కువగా ఉపయోగించటం చేయాలని, మన భూమిని మనమే కాపాడుకుంటాము అనే అంశాలపై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది .ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బుస్సా సురేష్ మాజీ కౌన్సిలర్ చారు గుండ్ల కొండ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలి



- పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

**మచిలీపట్నం: ఆగస్టు 31,(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అందిస్తున్న కొనుగోలు ప్రోత్సాహకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కోరారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్ నుంచి జిల్లా ప్రజలను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ వీడియో సందేశం ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.1 లక్షలోపు విలువైన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, రూ.2 లక్షలలోపు ఎలక్ట్రిక్ మూడు చక్రాల వాహనాలు, రూ.8 లక్షలలోపు ఎలక్ట్రిక్ ట్రాక్టర్ల కొనుగోలుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. కొత్త వాహనం కొనుగోలు చేసే సమయంలో ఎక్స్షోరూమ్ ధరపై 5 శాతం వరకు కొనుగోలు ప్రోత్సాహకం లభిస్తుందని తెలిపారు. పాత వాహనాన్ని ఇచ్చి, సంబంధిత నిబంధనల ప్రకారం కొత్త ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేస్తే 10 శాతం వరకు ప్రోత్సాహకం పొందే అవకాశం ఉందన్నారు. ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేసే సమయంలో షోరూమ్ నిర్వాహకులను ప్రభుత్వ ప్రోత్సాహక పథకం వివరాలను అడిగి తెలుసుకుని, అర్హత మేరకు ప్రయోజనం పొందాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన వ్యయాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని జిల్లాలో మరింత పెంచేందుకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పథకానికి సంబంధించిన మరింత సమాచారం, అర్హతలు, ఇతర వివరాల కోసం 7382560676 నంబర్ ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

## టిడ్కో ఇళ్ల విషయంలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట తప్పారు

### వైసిపి కౌన్సిలర్ వట్టెం మనోహర్



**జగ్గయ్యపేట ఆగస్టు 31 మనం న్యూస్:** టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించే విషయంలో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రాలు మాట తప్పారని, ఐదో వార్డ్ కౌన్సిల్ సభ్యులు వట్టెం మనోహర్ అన్నారు.జగ్గయ్యపేట మున్సిపల్ సాధారణ సమావేశంలో వైఎస్ఆర్సిపి మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళు ఎమ్మెల్యే శ్రీరామ రాజగోపాల్ చైర్మన్ రాఘవేంద్ర లు ఆగస్టు 15 కి 756 కుటుంబాలకు ఇళ్ల పత్రాలు తాళాలు అందజేసినట్టు ఆర్భాటంగా లబ్ధిదారులతో బలుసుపాడు రోడ్ లోని డిడ్కో నివాసాల వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు అన్నారు. వాస్తవానికి ఎమ్మెల్యే చైర్మన్ మాట తప్పారని ఇప్పుడు అక్కడ ఒక కుటుంబం కూడా నివాసం ఉండటం లేదని వాటర్ సదుపాయం విద్యుత్ సదుపాయం లేకుండా కేవలం మున్సిపల్ ఎన్నికల దృష్టిలో పెట్టుకొని టీడీపీ ఇళ్ల లబ్ధిదారుల ఆగ్రహానికి గురికాకుండా తప్పించుకునే విధంగా 756 కొన్ని ఇళ్ళని రంగులు వేసి తాళాలు ఇవ్వడం జరిగిందన్నారు.అసలు 3500 గృహాలు కేవలం 756 ఇంటి పత్రాలు తాళాలు ఇచ్చామని పచ్చి అబద్ధాలు ఆడడం జరిగింది, వాస్తవంగా అక్కడికి వెళ్లి చూస్తేకానీ ప్రజలు వారి కుటుంబంతో అక్కడ నివసించే పరిస్థితి లేదని అన్నారు. ఈ విషయంపై శాసనసభ్యులు మున్సిపల్ చైర్మన్ టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల విషయంలో మాట తప్పారు కాబట్టి లబ్ధిదారులకు క్షమాపణ చెప్పాలని వట్టెం మనోహర్ డిమాండ్ చేశారు. లేనియెడల లబ్ది దారులు, జగ్గయ్యపేట పట్టణంలో నివసించే ప్రజలు,ప్రభుత్వం మీద తీవ్ర వ్యతిరేకతమైన భావంతో ఉన్నారని మనోహర్ అన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైయస్ ఆర్సీ పి జగ్గయ్యపేట పట్టణంలో విజయం సాధించడం ఖాయమని కౌన్సిల్లో తెలియజేశారు . కాగా కౌన్సిల్లో ఈ అంశంపై వట్టెం మనోహర్ వ్యాఖ్యలను తెలుగుదేశం కౌన్సిల్ సభ్యులు తీవ్రంగా ఖండిస్తూ వాగ్వివాదానికి దిగారు. అదేవిధంగా ఎజెండాలోని 6,9,10,22,23,24, అంశాలలో కాంట్రాక్టర్లు 18 నుంచి 28 శాతానికి తగ్గింపు ధరకు కాంట్రాక్టులు దక్కించుకున్నారని సుమారు 70 లక్షల రూపాయలతో టెండర్లు పిలిస్తే 53 లక్షల కే పని చేస్తామని టెండర్ దక్కించుకొని ఏ విధంగా క్వాలిటీ ,కంపెనీ వారంటీ కల్పిస్తారో అధికారులు విచారణ జరపాలని టెండర్ కి సంబంధించిన సామాగ్రిని పూర్తిస్థాయిలో వీటిల్లో అవినీతి జరుగుతుందని పాతలైట్లకు రికార్డులు ఉండవని ప్రతి కౌన్సిల్లో కొత్త లైట్లు అదేవిధంగా రిపేరు కొరకు జనరల్ ఫండ్ కేటాయించడం నామినేషన్ వర్కులు ఇవ్వడం అధికార పార్టీకి సంబంధించిన కాంట్రాక్టర్లు దోచుకోవడానికి పాలకవర్గం పూర్తిగా సహకరిస్తుందని కొత్త కమిషనర్ కూడా ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని కౌన్సిల్లో వట్టెం మనోహర్ ఆరోపించారు. బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ ఆలం, ఆక్సిజన్ సిలిండర్స్, కోదాడ రోడ్ లో వీధిలైట్లకు సంబంధించి ఎజెండాలోని పై తెలిపిన అంశాలపై డీసెంట్ ని ఇస్తున్నట్లు ప్రకటించి కమిషనర్ కు తన డీసెంట్ను అందజేశారు.ఉన్నతాధికారులతో ఆ పనుల మీద విచారణ జరిపించాలని ఒకవేళ పనులు చేయాల్సి ఉన్నట్లయితే వాటిని సామాగ్రిని బహిరంగంగా కౌన్సిల్ సభ్యులకు, మీడియా వారికి చూపించాలని పని జరగకుండా బిల్లులు చేసుకోవడం అధికార పార్టీకి బాగా అలవాటైపోయిందని వట్టెం మనోహర్ ఫిర్యాదు లో పేర్కొన్నారు .

## కృష్ణా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతం

- ఎంఎస్ఎంఈ లకు సమగ్ర సహకారం.. విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహకాలు
- జిల్లా పారిశ్రామిక ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం: ఆగస్టు 31,(మనం న్యూస్):** జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్ తో కలిసి జిల్లాలో పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతి, సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులు, పెండింగ్ దరఖాస్తులు, పెట్టుబడుల గ్రౌండింగ్, ఎంఎస్ఎంఈ లకు అందిస్తున్న ప్రోత్సాహకాలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆగస్టు 3 నుంచి 31వ తేదీ వరకు మొత్తం 107 దరఖాస్తులు అందగా, వాటిలో 79 దరఖాస్తులు ఎస్ఎల్ఏ గడువు ఆమోదం పొందినట్లు అధికారులు తెలిపారు. మరో 28 దరఖాస్తులు ప్రస్తుతం ఎస్ఎల్ఏ వ్యవధిలో పెండింగ్లో ఉన్నట్లు వెల్లడించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఏపీఐఐసీ, భూగర్భ జలాలు, ఫ్యాక్టరీస్ తదితర శాఖలు తమ పరిధిలోని దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశ్రామిక అనుమతుల విషయంలో ఎటువంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టనర్షిప్ సమ్మిట్-2025 సందర్భంగా కుదిరిన అవగాహనా ఒప్పందాల పురోగతిని కూడా సమావేశంలో సమీక్షించారు. భూ కేటాయింపు, మౌలిక వసతులు తదితర అంశాల్లో పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఏపీఐఐసీ, జిల్లా పరిశ్రమల కేంద్రం, సంబంధిత లైన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పెట్టుబడులు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు వివిధ పెట్టుబడి, వడ్డీ రాయితీ క్లెయిమ్ల కింద 5 పరిశ్రమలకు మొత్తం రూ.1,36,53,854 ప్రోత్సాహకాలను మంజూరు చేసి ఆమోదించారు. సుస్థిర రవాణాను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఏపీ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ (ఎస్ఎంఈపి) 4.0 కింద ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు ప్రోత్సాహక క్లెయిమ్లకు రూ.64,166 మంజూరు చేశారు. ఎస్ఎంఈపి 4.0 నిబంధనల ప్రకారం, సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ లేకుండా ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేసిన వారికి ఎక్స్షోరూమ్ ధరపై 5 శాతం, నమోదిత వాహన స్క్రాపింగ్ కేంద్రం నుంచి సర్టిఫికెట్ సమర్పించిన వారికి 10 శాతం వరకు కొనుగోలు ప్రోత్సాహకం, నిర్దేశిత పరిమితులకు లోబడి అందుతుందని అధికారులు తెలిపారు. దీనితో పాటు 100 శాతం రోడ్డు పన్ను మినహాయింపు కూడా అమల్లో ఉందని పేర్కొన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఎల్డిఎం సి రవీంద్రారెడ్డి, డిఆర్డిఏ, మెప్మా పీడీలు హరిహరనాథ్, సాయిబాబు, డిపిఓ ఎం ధనలక్ష్మి, ఉద్యాన మత్స్యశాఖ అధికారులు జే జ్యోతి, అయ్యా నాగరాజా, డిటిడబ్ల్యూఓ ఫణి ధూర్జటి, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో మదర్ ఫీడింగ్ రూముల ఏర్పాటు, ప్రజారోగ్య ప్రమాణాలపై మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీలు



**మచిలీపట్నం, ఆగస్టు 31,(మనం న్యూస్):** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు మెరుగైన ప్రజారోగ్య సదుపాయాలు కల్పించడం, ముఖ్యంగా తల్లులు మరియు శిశువులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచడం లక్ష్యంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అడపా సుబ్రహ్మణ్యం సోమవారం మచిలీపట్నం నగరంలోని పలు ముఖ్యమైన ప్రజా రద్దీ ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం మెయిన్ బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూమును పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న సదుపాయాలు, నిర్వహణ విధానం తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తల్లులు తమ చిన్నారులకు సౌకర్యవంతంగా, పరిశుభ్రమైన వాతావరణంలో పాలిచ్చేందుకు ఇటువంటి మదర్ ఫీడింగ్ రూములు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ పరిధి, పీవీఆర్ మల్టీప్లెక్స్ మాల్ పరిధి మరియు డి-మార్ట్ పరిధిలోని ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రజల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో తల్లులు, శిశువుల సౌకర్యార్థం తప్పనిసరిగా మదర్ ఫీడింగ్ రూములను ఏర్పాటు చేయాలని సంబంధిత యాజమాన్యాలు మరియు నిర్వాహకులకు సూచించారు. జనసంచారం అధికంగా ఉండే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు మరియు ఇతర ముఖ్యమైన ప్రజా ప్రదేశాలలో పరిశుభ్రమైన, సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన మదర్ ఫీడింగ్ రూముల ఏర్పాటు అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా మెయిన్ బస్టాండ్ ఆవరణంలోని క్యాంటీన్ను, పీవీఆర్ మల్టీప్లెక్స్లోని ఫుడ్ స్టాల్స్ను కూడా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పరిశీలించారు. ప్రజారోగ్య దృష్ట్యా అక్కడ పాటిస్తున్న పారిశుధ్య ప్రమాణాలు, ఆహార పదార్థాల నిల్వ కోసం వినియోగిస్తున్న ఫ్రీజర్లు, ఆహార భద్రతకు సంబంధించిన ఫుడ్ లైసెన్సులు మరియు సంబంధిత ధృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన మరియు సురక్షితమైన ఆహార పదార్థాలు అందించేందుకు ప్రతి ఆహార వ్యాపార సంస్థ తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని, అవసరమైన లైసెన్సులు మరియు ధృవపత్రాలను సక్రమంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. మచిలీపట్నం నగరంలో ప్రజారోగ్యం, పారిశుధ్యం మరియు తల్లీ-శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజా రద్దీ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అడపా సుబ్రహ్మణ్యం గారు, నగరపాలక సంస్థ కమీషనర్ చోడే వీర వెంకట సత్య బాపిరాజు తెలిపారు



# హిందూ సంఘాల మీద ఆరోపణలు, మీ వ్యక్తిత్వాలకు బీటలు. హిందూ సంఘాల ఐక్యత

**కొన్ని శక్తులు ఒత్తిడులు, ప్రకటనల రూపంలో హిందూ సంఘాల మీద ఆరోపణలు**

**నందిగామ,ఆగష్టు31(మనం న్యూస్):** నందిగామలో రామలింగేశ్వర స్వామి వారి తెప్పోత్సవ కోనేరు బాగుపడటం ఇష్టం లేనట్టుగా కొన్ని శక్తులు ఒత్తిడులు రూపంలో ప్రకటనల రూపంలో హిందూ సంఘాల మీద మరియు దేవాలయ అధికారుల మీద సాటి హిందువులే ప్రశ్నించడం ఆశ్చర్యకరంగా ఉంది. 1 తెప్పోత్సవం జరిగితే ప్రాంతం ఆధ్యాత్మికంగా పెరగటం మీకు ఇబ్బంది కలిగిస్తుందా.. 2 తెప్పోత్సవం వల్ల పేదలు మధ్యతరగతి ప్రజలు రకరకాల అయినటువంటి పూజా సామాన్లు అమ్ముకోవడం ద్వారా ఆర్థికంగా బలపడితే మీకు ఇబ్బంది కలిగిస్తుందా... 3 తెప్పోత్సవాన్ని సందర్శించడానికి వచ్చేటువంటి భక్తులు ఆటోలు బస్సులు రకరకాల అయినటువంటి ప్రయాణ సాధనాల ద్వారా నందిగామ కోస్తే ఆర్థికంగా చాలామంది స్థిరపడితే నందిగామలో వ్యాపారం వృత్తులు పెరిగితే మీకు ఇబ్బంది కలిగిస్తుందా ... మీరు ఏమి ఆశించి అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అది బయట పెట్టాలి. మాకు ఒక రాజకీయ పదవి వస్తుంది లేదు మేము ఆర్థికంగా బలపడతాం. ఎదుటివాళ్ళు మాకు డబ్బులు ఇస్తానన్నారు అనేలాంటి ప్రకటనలు చేయాల... అంతేకానీ ఏదో మమ్మల్ని కూడా జనం గుర్తించాలనేటువంటి ఆలోచనతో పనికిమాలిన ప్రకటనలు ఇచ్చి సమాజంలో మిగతా హిందువులు తెలివి తక్కువ వారు మేము చాలా తెలివిగల వాళ్ళం అనేటువంటి ఆలోచనలోంచి బయటికి రావాలని మేము హిందూ సంఘాలుగా కోరుకుంటున్నాము. ఎందుకంటే దేశం బానిసత్వంలోకి పోవడానికి కారణం పాత రోజుల్లో ఇలాంటి ఆలోచనలు చేసే హిందువులు విదేశాల నుంచి వచ్చినటువంటి వాళ్లకి ఆశ్రయం కల్పించి బానిసత్వానికి కారణమయ్యారు కాబట్టి అనవసరమైన టువంటి మాటలు జారకుండా మీ శక్తి కొలది మీరు కూడా ఈ కోనేరు ఉద్యమంలో పాల్గొని హిందూ సంఘాల ఐక్యతను చూపించాలని ఆహ్వానిస్తున్నాము.

# జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ పై సీఆర్డీఏకు తగిన ఆదేశాలు

**మంత్రివర్గ ఉపసంఘం ముందుకూ ప్రతిపాదన: సురేష్ కుమార్**

**అమరావతి, ఆగష్టు,31,(మనం ప్రతినిధి):** అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ప్రభుత్వం తరఫున వెంటనే సీఆర్డీఏ కమిషనర్కు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అంతేకాకుండా జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్కు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వంలో సంబంధిత మంత్రివర్గ ఉప సంఘం ముందుంచి తదుపరి చర్యలకు మార్గం సుగమం చేస్తామని స్పష్టం చేశారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సోమవారం సురేష్ కుమార్ను కలిసి, సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని సమర్పించారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్కు సంబంధించిన న్యాయపరమైన, విధానపరమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ ఇచ్చిన లీగల్ ఒపీనియన్ను అనుసరించి సొసైటీ సభ్యులకు గృహ నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవని వివరించారు. సొసైటీ ప్రతినిధుల వాదనలను సావధానంగా విన్న ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన చర్యలు తీసుకుంటామని, సీఆర్డీఏ కమిషనర్కు వెంటనే ఈ విషయంపై మెమో పంపిస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ స్కీమ్కు సంబంధించిన ప్రతిపాదనను మంత్రివర్గ ఉప సంఘం ముందుంచి, ప్రభుత్వ స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో జారీచేసిన జీఓ ఎంఎస్ నంబర్ 107 విధివిధానాలను స్పష్టం చేసిందని, దాని అమలుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఐ అండ్ పీఆర్ కమిషనర్ విశ్వనాథన్ ను సైతం సంఘం ప్రతినిధులు కలిశారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా విశ్వనాథన్ తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీ సొసైటీ సమర్పించిన న్యాయపరమైన అభిప్రాయం స్పష్టంగా ఉందని, సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తామని చెప్పారు. లీగల్ ఒపీనియన్ పరంగా పరిశీలించినప్పుడు అమరావతిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీఓ అమలుకు ఎటువంటి అడ్డంకి లేదని తెలిపారు. సుదీర్ఘకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ స్కీ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ , ఐపీఆర్ కమిషనర్ విశ్వనాథన్ స్పష్టమైన హామీ ఇవ్వడం పట్ల సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి సీఆర్డీఏ కమిషనర్కు మెమో పంపడం, అనంతరం మంత్రి వర్గ ఉప సంఘం ముందుకు అంశాన్ని తీసుకెళ్లే ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ స్కీమ్కు త్వరలోనే పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి, ది పయనీర్ చీఫ్ ఆఫ్ బ్యూరో డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాథ్, ఆంధ్ర ప్రభ చీఫ్ ఆఫ్ బ్యూరో నేరెళ్లకుంట గోపి పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్ట్ వట్టికొండ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుల పరామర్శించిన ఎంపీ కేసినేని నాని

**కంచికచర్ల ఆగస్టు 31 (మనం న్యూస్):** ప్రెస్ క్లబ్ ఆఫ్ కంచికచర్ల గౌరవ అధ్యక్షులు సీనియర్ జర్నలిస్ట్ వట్టి కొండ వెంకటేశ్వరరావు తండ్రి అయిన వట్టికొండ కోటేశ్వరరావు గారు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ (చిన్ని). సోమవారం కంచికచర్ల మండల పరిధిలోని కునికిన పాడు గ్రామం విచ్చేసి వీరి తల్లి గారితో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగినది. అనంతరం స్వర్గీయ వట్టి కొండ కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మండల టిడిపి పార్టీ అధ్యక్షులుకోగంటి బాబు ఆర్ఎస్పి, మాజీ ఎంపీటీసీ సభ్యులు తేళ్ల నరసింహారావు, కోటేశ్వరరావు మండల తెలుగు యువత అధ్యక్షులు గుదే నరేష్ వెలగా వెంకయ్యబండి కోటేశ్వరరావు తిరుపతిరావు మాజీ తెలుగు యువత అధ్యక్షులు వెలగా శ్రీనివాసరావు కొండపనేని నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకింగ్ రంగంలో రవీంద్ర బాబు సేవలు చిరసమ్మరణీయం

**మచిలీపట్నం, ఆగష్టు 31,(మనం న్యూస్):** ఆంధ్రాబ్యాంక్ ఎంప్లాయిస్ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ లో 36 సంవత్సరాలు సుదీర్ఘ సేవలు అందించిన రావుల రవీంద్రబాబు చిరస్మరణీయమని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. రవీంద్రబాబు పదవీ విరమణ సందర్భంగా సోమవారం బ్యాంకు ప్రాంగణంలో మేనేజర్ సిబ్బంది కస్టమర్ల సంయుక్త సమావేశంలో ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ రవీంద్రబాబు సుదీర్ఘ పదవీకాలంలో కస్టమర్లకు అందుబాటులో ఉంది కస్టమర్ల మన్ననలు పొందారని అన్నారు. హైదరాబాదు, రాజమండ్రి, మచిలీపట్నం బ్రాంచ్ లలో లో ఆయన అందించిన సేవలు మరువ లేనివని అని అన్నారు. బ్రాంచ్ మేనేజర్ ఎం సోమశేఖర్ మాట్లాడుతూ రవీంద్రబాబు తన పదవీకాలంలో ఉన్న అధికారుల మందనాలు పొందాలని అన్నారు ఎంతో అనుభవం కలిగిన రవీంద్రబాబు పదవీ విరమణ బ్యాంకింగ్ రంగనానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో లంకిశెట్టి హరనాథ్ బాబు బ్యాంకు సిబ్బంది పాలుగున్నారు.

